నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, శుక్రవారం 31 మే 2024 | HYDERABAD


# అర్ధరాత్రి.. క్యాబ్‌ను అడ్డగించి..

## డ్రైవర్‌ను బ్లేడుతో గాయపరిచి.. టెక్కీలను దోచుకున్న వైనం

జీడిమెట్ల, మే 30: అర్ధరాత్రి క్యాబ్‌ను అడ్డగించి డ్రైవర్‌పై దాడి చేసి.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను దోచుకున్నారు దుండగులు. ఈ ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం అర్ధరాత్రి డ్రైవర్ అనిల్ తన క్యాబ్‌లో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను హైటెక్ సిటీ మాదాపూర్ నుంచి షాపూర్‌నగర్ నెహ్రూనగర్‌కు తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో గాజులరామారంలోని నెహ్రూనగర్ ప్రధాన రహదారికి చేరుకోగానే మున్నా, రాజాసింగ్, అఖిల్‌తో పాటు మరో ముగ్గురు దుండగులు మద్యం మత్తులో క్యాబ్‌ను అడ్డగించారు. ఉద్యోగుల వద్ద డబ్బులు డిమాండ్ చేశారు. వారి సెల్‌ఫోన్, కొంత నగదును లాక్కున్నారు. అనిల్ మెడపై బ్లేడుతో దాడి చేసి గాయపర్చగా, అతడిని చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీడిమెట్ల సీఐ విజయ్ తెలిపారు.



గురువారం బంజారాహిల్స్ ఐసీసీసీ భవనంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్, నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి



ఇది యూసుఫ్‌గూడలోని నాలా. వరద నీటిని మోసుకు పోవాల్సిన ఈ నాలా పూర్తిగా చెత్త, పూడికతో నిండిపోయింది. నాలాలో నీరు సాఫీగా పోయేందుకు చేపట్టాల్సిన పనులు కాంట్రాక్టర్ల సమ్మెతో జరగలేదు. కొన్నిరోజుల కిందట జీహెచ్‌ఎంసీ ఈఈ రాజ్ కుమార్, డిప్యూటీ ఈఈ రామచంద్రరాజు నాలాను పరిశీలించారు. కానీ ఇప్పటికీ ఆ నాలా దుస్థితి ఇలా ఉన్నది. ఒకవేళ చిన్నపాటి వర్షం పడినా.. నాలాలో వరద ప్రవాహానికి దారి లేదు. ఈ క్రమంలో వరద నివాస గృహాలను ముంచెత్తే ప్రమాదం లేకపోలేదు.

# ముంపు ముప్పు తప్పదా?

## ఎక్కడికక్కడ నాలాల్లో పేరుకుపోయిన పూడిక, చెత్త

నగరంతో పాటు శివారుల్లో పడకేసిన 'ఎస్‌ఎన్‌డీపీ'

చెట్ల కొమ్మల కొట్టివేతలోనూ విద్యుత్ శాఖ నిర్లక్ష్యం

వర్షాకాలం నేపథ్యంలో 'లోతట్టు'లో భయాందోళనలు

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మే 30 (నమస్తే తెలంగాణ)/జూబ్లీహిల్స్, బేగంపేట: ఎక్కడికక్కడ నాలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలు..పడకేసిన 'ఎస్‌ఎన్‌డీపీ' పనులు..వెరసి.. నగర పరిధిలోనే కాదు.. శివారులోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోని లోతట్టు ప్రాంతాలకు వర్షాకాలంలో వరద ముప్పు పొంచి ఉన్నది. ప్రభుత్వాలు మారినా... ప్రజల మౌలిక వసతులు, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి సంబంధించిన పనులు మాత్రం ఆగొద్దు. సీజన్ల వారీగా జరగాల్సిన పనులు పూర్తయితేనే జనం ఇబ్బందులు తొలిగిపోతాయి. అయితే కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ముందుచూపుతో చేపట్టిన వ్యూహాత్మక నాలా అభివృద్ధి కార్యక్రమం (ఎస్‌ఎన్‌డీపీ)తో ప్రతి ఏటా చేపట్టే నాలాల పూడికతీత పనులు నాలుగైదు నెలలుగా పడకేశాయి. నిధులు లేవంటూ.. జీహెచ్‌ఎంసీ అధికారులు పనులపై శీతకన్ను ప్రదర్శిస్తున్నారు. కాంట్రాక్టర్ల సమ్మెతో పరిస్థితిని మరింత దిగజార్చింది. ఇప్పటికే నైరుతి రుతుపవనాలు కేరళను తాకిన దరిమిలా.. మరో వారం రోజుల్లోనే వర్షాలు పడే సూచనలు కనిపిస్తున్నాయి. సాధారణ వర్షం పడితేనే నాలాల్లో వరద ముందుకుపోయే పరిస్థితి లేదు. అదే భారీ వర్షం పడితే మాత్రం బస్తీలు, కాలనీలకు వరద ముప్పు పొంచి ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

### చినుకుపడితే నగరం ఆగమే..

చినుకుపడితేనే నగరం వణుకుతున్నది. రోడ్లన్నీ చెరువులను తలపించడం సాధారణంగా మారుతున్నది. ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు నరకం చూస్తున్నారు. అందుకే వర్షాకాలానికి ముందే అధికార యంత్రాంగం కచ్చితంగా కొన్ని పనులను పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రధానంగా విద్యుత్ వైర్లకు అడ్డుగా, అల్లుకుపోయిన చెట్ల కొమ్మలను తొలగించడం ఒకటైతే... నాలాల్లో పూడికను తీసివేసి, వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండు పనులనూ గాలికొదిలేసింది. ఏ ఒక్కనాడూ ప్రభుత్వ, అధికార యంత్రాంగం వీటిపై దృష్టిసారించలేదు. విద్యుత్ శాఖలో ఎల్‌సీలను రద్దు చేయడంతో చెట్ల కొమ్మలను కొట్టే పనులను చేపట్టలేదు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ఆ పనులను చేపడుతుండగా, చాలా చోట్ల పూర్తి కాలేదు. ఏటా వేసవిలోనే కొమ్మల తొలగింపు పనులను పూర్తి చేయడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాదిలో ఆ ప్రక్రియను సరిగ్గా చేపట్టకపోవడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.



ఇది బేగంపేటలోని కట్టమైసమ్మ దేవాలయం వెనక, ధనియాలగుట్టలో ఉన్న నాలాల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు. కూకట్‌పల్లి, అమీర్‌పేట నుంచి వచ్చే నాలా బేగంపేట కట్టమైసమ్మ దేవాలయం వెనక కలుస్తుంది. ఇక్కడి నుంచి బ్రాహ్మణవాడి మీదుగా ప్రవహించి హుస్సేన్‌సాగర్ నాలాలో చేరుతుంది. ప్రస్తుతం ఈ నాలాల్లో చెత్త, పూడిక పేరుకుపోవడంతో దుర్గంధం వ్యాపించింది. ఇక... చినుకుపడితే వరద వెళ్లే మార్గం లేక నాలాను అనుసరించి ఉన్న బస్తీలు, కాలనీలన్నీ జలదిగ్బంధం అయ్యే ప్రమాదమున్నది. అయితే ఇప్పటికైతే 60 శాతం పనులు పూర్తి చేశామని ఈఈ సుదర్శన్ చెబుతున్నారు. పనులు పూర్తి కాకపోవడంతో వర్షాలు పడితే తమ పరిస్థితి ఏమిటని జనం బిక్కుబిక్కుమంటున్నారు.

### గాడి తప్పిన జీహెచ్‌ఎంసీ..

కొన్ని నెలలుగా నగరంలో జీహెచ్‌ఎంసీ అభివృద్ధి, నిర్వహణ పనులు గాడి తప్పాయి. ఒకవైపు ప్రజల మౌలిక వసతులకు సంబంధించిన ఎస్‌ఆర్‌డీపీ (వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం)తో పాటు ఎస్ఐజీ (స్పెషల్ ఇన్‌ఫ్రా గ్రాంట్) కింద చేపట్టాల్సిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే నిలిపివేశారు. కొన్నిరోజుల కిందట జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఎస్ఐజీ కింద రూపొందించిన 754 పనులను పూర్తిగా రద్దు చేశారు. మరోవైపు నాలాల్లో పూడిక తీత పనులపైనా నిర్లక్ష్యం వహించారు. కొన్ని ప్రాంతాల్లో కొంత మేర పనులు జరుగుతున్నా... సమయం మించి పోవడంతో నగరంలో ఎక్కడ చూసినా నాలాల్లో చెత్త, పూడిక పేరుకుపోయాయి. దీంతో చిన్నపాటి వర్షం నీరు కూడా పోయే మార్గాలు మూసుకుపోయాయి. ఆ వరద వెనక్కి వచ్చి.. నివాసాలను ముంచెత్తే ప్రమాదం పొంచి ఉందని అనేక ప్రాంతాల్లో లోతట్టు ప్రాంత ప్రజలు భయపడుతున్నారు.

### అటకెక్కిన ఎస్‌ఎన్‌డీపీ పనులు..

గ్రేటర్‌లో నాలా అభివృద్ధి పనులు గడిచిన ఐదు నెలలుగా నత్తనడకన సాగుతున్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రధానమైన హుస్సేన్‌సాగర్ వరద నీటి నాలా, బల్కాపూర్ నాలా పనులతో పాటు శివారు మున్సిపాలిటీల్లో చేపట్టిన పనులు మధ్యనే నిలిచిపోయాయి. చేసిన పనులకు జీహెచ్‌ఎంసీ బిల్లులు చెల్లించడం లేదని , పెండింగ్ బిల్లులు ఇస్తేనే పనులు చేపడతామంటూ కొన్ని చోట్ల కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వరద నీటికి శాశ్వత చర్యలు చేపట్టాలని భావించి..ఎస్‌ఎన్‌డీపీ తొలి విడత పథకం ద్వారా రూ. 985.45కోట్లతో 58 చోట్ల నాలా అభివృద్ధి పనులను చేపట్టింది. పనులను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని రూ.531 కోట్లతో 35 ప్రాంతాల్లో వేలాది కాలనీల వరద ముంపు సమస్యకు పరిష్కారం చూపింది. అయితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్‌ఎన్‌డీపీ పనుల పురోగతిపై సమీక్షించిన దాఖలాలు లేవు. ఖజానాలో డబ్బుల్లేక కాంట్రాక్టర్లకు చెల్లింపులను నిలిపివేశారు. చాలా చోట్ల గోడలు, స్లాబుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఫలితంగా రూ.394.65 కోట్లతో 20 చోట్ల జరుగుతున్న పనులపై తీవ్ర ప్రభావం పడింది. ఎస్‌ఎన్‌డీపీ పనులు పూర్తి కాకపోవడంతో సరూర్‌నగర్, నాగోల్, సికింద్రాబాద్, ఎల్బీనగర్, చార్మినార్, చాంద్రాయణగుట్ట హయత్‌నగర్, వనస్థలిపురం, హబ్సిగూడ, ఉప్పల్ రామంతాపూర్‌తో పాటు శివారు ప్రాంతాలైన బడంగ్‌పేట, జల్‌పల్లి, పెద్ద అంబర్‌పేట, మీర్‌పేట ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి.

# 4న ఓట్ల లెక్కింపు.. మూడంచెల భద్రత

సిటీబ్యూరో, మే 30 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ భవనంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లపై అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియమ నిబంధనలను జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు వివరించారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి ఎవరిని అనుమతించాలి.. ఎవరిని అనుమతించకూడదు.. మీడియా సెంటర్, కేంద్రాల వద్ద ఏర్పాట్లు, కౌంటింగ్ ఏజెంట్లకు సంబంధించిన వివరాలను వివరించారు. నగర పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఉంటుందని, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు పక్కాగా అమలు చేయాలని సూచనలు చేశారు.

# బోడుప్పల్ అవిశ్వాసంపై స్టే



బోడుప్పల్, మే 30 : బోడుప్పల్ నగరపాలక సంస్థ మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవి గౌడ్‌పై పెట్టిన అవిశ్వాసానికి స్టే విధిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు బీఆర్‌ఎస్ బోడుప్పల్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల17న కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతో బోడుప్పల్ మేయర్, డిప్యూటీ మేయర్లపై స్థానిక కార్పొరేటర్లు జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన అవిశ్వాస నోటీసుపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని గురువారం రాష్ట్ర హైకోర్టు స్టే విధించినట్టు వివరించారు.



# 3 నుంచి బడిబాట

మేడ్చల్ కలెక్టరేట్, మే 30 : బడిబాట కార్యక్రమాన్ని జూన్ 3 నుంచి ప్రారంభించనున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి వెల్లడించారు. ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో 3 నుంచి 19వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. తొలిరోజు గ్రామస్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి, ప్రతిజ్ఞ చేయడం, 4న బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశం కల్పించి.. గ్రామస్థాయిలో రిజిష్టర్‌లో పేరు నమోదు చేయడం, 5 నుంచి 10వ తేదీ వరకు గడప గడప ప్రచారం, అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం, బడిబాటపై కరపత్రాలు, బ్యానర్లతో ప్రచారం, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి, పాఠశాలలో చేర్పించే కార్యక్రమాలు ఉంటాయన్నారు. 11న గ్రామసభలు నిర్వహించి, బడిబాట కార్యక్రమాన్ని సమీక్షిస్తామన్నారు. 12న పాఠశాల సుందరీకరణ, పండుగ వాతావరణం నెలకొల్పడం, తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి, అమ్మ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన పనులను ప్రారంభించడం, పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ, 13న ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాలు, పుస్తకపఠనం, 14న సామూహిక అక్షరాభ్యాసం, బాలసభలు, 15న దివ్యాంగులను భవిత సెంటర్లలో, బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించడం, విద్యార్థుల ప్రవేశాలను పెంపొందించడం, 18న డిజిటలైజేషన్‌పై, ఆంగ్ల మాధ్యమంపై విద్యార్థులకు అవగాహన, 19న స్పోర్ట్స్ డే నిర్వహించి, విద్యార్థులకు వివిధ క్రీడల్లో పాల్గొనేలా చేయడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి వివరించారు. తేదీల వారీగా కార్యక్రమాలను అమలు చేసి, బడిబాటను విజయవంతం చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.



రాజుతో కేక్ కట్ చేయిస్తున్న పారిశుధ్య సిబ్బంది

# బాధ్యతగా నిలిచి.. స్వచ్ఛతగా మార్చి

## వ్యర్థరహితకాలనీగా తీర్చిదిద్ది..స్ఫూర్తినిచ్చిన స్థానికుడు రాజు

పుట్టిన రోజు.. ఘనంగా సన్మానించిన పారిశుధ్య సిబ్బంది

మియాపూర్ , మే 30 : తాను బాధ్యతగా ఉండటమే కాదు.. పది మంది ఆచరించేలా చేశారు ఆ కాలనీ వాసి. చెత్తకుప్పలు లేని కాలనీలే లక్ష్యమనే బల్దియా నినాదాన్ని పాటించి.. ప్రజలను చైతన్యవంతులను చేసి..చక్కటి ఫలితాన్ని సాధించారు. పరిమిత సంఖ్యలో నివాసాలుండే ఆ కాలనీలో ఏండ్ల తరబడి సమస్యగా మారిన వ్యర్థాల కుప్పలను శాశ్వతంగా నిర్మూలించగలిగారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని కొండాపూర్ డివిజన్ గఫూర్ కాలనీ సంక్షేమ సంఘానికి చెందిన సభ్యులు రాజు చిరు వ్యాపారి. 100కు పైగా గడపలున్న ఆ కాలనీలో సుమారు 1200 మంది వరకు ప్రజలు నివసిస్తున్నారు. అయితే కాలనీలో కొన్నేండ్లుగా మూడు ప్రాంతాల్లో నిత్యం చెత్త ఇతర వ్యర్థాలు పోగయ్యేవి. ఇటీవల వాటిని పూర్తి స్థాయిలో నిర్మూలించే లక్ష్యంతో జడ్‌సీ స్నేహ శబరీశ్ అధికారులతో కలిసి నిత్యం క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తూ..ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. శేరిలింగంపల్లి సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ నగేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డితో పాటు ఎస్‌ఆర్‌పీ, ఎస్‌ఎఫ్‌ఏ, పారిశుధ్య సిబ్బంది చెత్త పేరుకునే ప్రాంతాల నిర్మూలనపై పలు దఫాలుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం సభ్యులుగా రాజు.. ప్రతి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. తన వంతుగా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని కాలనీవాసులకు అవగాహన కల్పించారు. వందకు పైగా ఇండ్లకు తిరిగి.. ప్రజలను చైతన్యవంతులను చేయడంలో ఆయన సఫలమయ్యారు. చివరికి కాలనీలోని చెత్త కుప్పల ప్రాంతాలను వ్యర్థరహితంగా మార్చగలిగారు. రాజు కృషి ఫలితంగా.. ప్రస్తుతం గఫూర్‌నగర్‌లో ఒక్క చెత్త కుప్ప కూడా కనిపించడం లేదు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛ ఆటోలకు వ్యర్థాలను అందిస్తూ.. ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాజు పుట్టినరోజు కావడంతో పారిశుధ్య సిబ్బంది.. వ్యర్థాలను పూర్తిస్థాయిలో నిర్మూలించిన ప్రాంతంలోనే ఆయనను సన్మానించారు. పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించి.. పది మందికి స్ఫూర్తి నింపే ప్రయత్నం చేశారు.



గురువారం తెలంగాణ సారస్వత పరిషత్తులో జరిగిన బాల సాహిత్య సమ్మేళనంలో పాల్గొన్న వక్తలు

# 'ఉపాధ్యాయులదే బాధ్యత'

తెలుగు యూనివర్సిటీ, మే 30 : పుస్తక పఠనంతో పాటు సామాజిక వికాసానికి విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని విద్యాపరిశోధన, శిక్షణ మండలి సంచాలకురాలు ఎం. రాధారెడ్డి అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తులో కొనసాగుతున్న బాలల సాహిత్య సమ్మేళనం ముగింపు సభలో పాల్గొన్న రాధారెడ్డి ప్రసంగించారు. బాల్యదశలోనే చిన్నారుల్లో మాతృభాష పట్ల మమకారంతో పాటు ఉత్తమ గుణాలను అలవర్చుకునేలా చూడాలన్నారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ప్రసంగిస్తూ.. బాల సాహిత్య రంగంలో ఉత్తమ గ్రంథానికి ఇరవై వేల రూపాయల నగదు పురస్కారాన్ని వచ్చే ఏడాది నుంచి అందజేస్తామన్నారు. బాలల వ్యక్తిత్వ వికాసం కోసం పరిషత్తు చేస్తున్న కృషిని మోడల్ స్కూల్స్ విభాగం సంయుక్త సంచాలకురాలు పాలడుగు సరోజినీదేవి కొనియాడారు. కార్యక్రమంలో పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య, ప్రముఖ బాలసాహితీవేత్త గరిపెల్లి అశోక్ పాల్గొన్నారు.

# 40 డిగ్రీలు దాటి..

సిటీబ్యూరో, మే 30 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఎండలు మళ్లీ దంచికొడుతున్నాయి. 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో నగర జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కిందిస్థాయి గాలులు పశ్చిమ దిశ నుంచి తెలంగాణ వైపు వీస్తుండటంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నట్లు వాతావరణ కేంద్రం అధికారులు చెబుతున్నారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు గ్రేటర్‌లో గరిష్ఠం 40.4, కనిష్ఠం 29.4, గాలిలో తేమ 29శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రానున్న రెండు మూడు రోజులు ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలు దాటే అవకాశాలున్నట్లు హెచ్చరించారు.

